28న రక్తదాన శిబిరం

చింతల్: ఉషారాణి మెమోరియల్ ట్రస్ట్, ఉషారాణి నేచురోపతి క్లీనిక్ ఆధ్వర్యంలో ఈనెల 28న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఉషారాణి నేచురోపతి క్లీనిక్ ఆక్యుపంచరిస్ట్ డాక్టర్ రాధిక లేళ్ల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీహెచ్‌బీ కాలనీలోని బాలాజీ రెసిడెన్సీలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉత్సాహవంతులైన వారు 9392837198 నంబర్‌కు కాల్ చేసి తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

ప్రజావాణిలో 5 ఫిర్యాదులు

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 5 ఫిర్యాదులు వచ్చాయని జీఎం మాధవి పేర్కొన్నారు. భూగర్భ డ్రైనేజీ పొంగిపొర్లుతోందని ఒక ఫిర్యాదు రాగా, తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదంటూ 3 ఫిర్యాదులు, అదేవిధంగా నీటి బిల్లు అధికంగా వస్తుందని మరో ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. వాటర్ వర్క్స్ డీజీఎంలు, మేనేజర్లు, ఎలక్ట్రికల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త డబ్బాల తొలగింపు



తొలగించిన చెత్త డబ్బాలు

సాక్షి ఎఫెక్ట్..

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లోని స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ విగ్రహం పక్కనే జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెత్తను సేకరించే డబ్బాలను ఏర్పాటు చేశారు. ఈ విషయమై 'సాక్షి'లో 'మహనీయుడా..క్షమించు' అనే కథనం సోమవారం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. ఉదయం జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెత్త డబ్బాలను అక్కడి నుంచి తొలగించారు.

పొంచి ఉన్న ప్రమాదం..!



నిజాంపేట్: బాలాజీనగర్‌లోని రవీంద్ర భారతి స్కూల్ ఎదుట డ్రైనేజీ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. చాలారోజులుగా తెరిచి ఉంటుందని, అసలే భారీ వర్షాలు కురుస్తున్నాయని ఏదైనా ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దేవీ శరన్నవరాత్రోత్సవాలు షురూ



బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణలో గాజులరామారం చిత్తారమ్మదేవి

కుత్బుల్లాపూర్ నియోజకవర్గవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు ఆలయాలు, మండపాల వద్ద దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మవార్లను బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. అలాగే ఆలయాల్లో హోమాలు, కుంకుమార్చనలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

–రంగారెడ్డినగర్



నిజాంపేట్ దుర్గామాత ఆలయంలో...



శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో..



చిత్తారమ్మ ఆలయంలో మొదటి పూజ..



సాయిబాబానగర్ కృషికాలనీలో ..

'ఇండ్ల కూల్చివేత పాపం బీఆర్‌ఎస్‌దే'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు కిశోర్‌రెడ్డి



బాధితులను పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సుభాష్‌నగర్: గాజులరామారం దేవేందర్‌నగర్ సర్వే నంబర్ 307లో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థకు కేటాయించిన భూములు 329, 342, 307లలో 'ఇండ్ల కూల్చివేత పాపం బీఆర్‌ఎస్‌దే' అని కాంగ్రెస్ యువ నాయకుడు బొంగునూరి కిశోర్‌రెడ్డి విమర్శించారు. గండి మైసమ్మలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొందరు అధికారులను అడ్డుపెట్టుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా చేశారని మండిపడ్డారు. ఇప్పుడు గాజులరామారంలో జరిగిన కూల్చివేతలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపడం సరైన పద్ధతి కాదన్నారు. దీనికి బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పేద ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

కూల్చివేతల పరిశీలన

గాజులరామారంలో ఇండ్లు కోల్పోయిన పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 307లో హైడ్రా అధికారులు కూల్చివేసిన బస్తీలను సోమవారం అఖిలభారత రాష్ట్రీయ దళిత సేనా ఓబీసీ జాతీయ అధ్యక్షుడు గూడ ఐలయ్య గౌడ్, దళిత సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు బూదాల అమర్ బాబు పరిశీలించి బాధితులను పరామర్శించారు. తక్షణమే వారికి స్థలానికి స్థలం లేదా డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించాలని కోరుతూ సీఎంను కలుస్తామని తెలిపారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



సుభాష్‌నగర్: జీఎస్టీ శ్లాబ్‌ల నూతన విధానం అమల్లోకి రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ సూరారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కేశవయాదవ్ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ మార్కెట్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన జీఎస్టీ విధానంతో దేశప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జనరల్ సెక్రెటరీ నందనం దివాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్ రెడ్డి, బావిగడ్డ రవి, గిరివర్ధన్ రెడ్డి, శేఖర్, వాసు, డివిజన్ల అధ్యక్షులు రాజ చారి, మణికంఠ రాజు తదితరులు పాల్గొన్నారు

'రాంబాబు కుటుంబానికి న్యాయం చేయాలి'



ధర్నాకు దిగిన బంధువులు, ఉద్యోగులు

జీడిమెట్ల: షాపూర్‌నగర్‌లో విద్యుదాఘాతంతో ఆదివారం మృతిచెందిన ఆర్టిజెన్ రాంబాబు కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి బంధువులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం రాంబాబు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహంతో జీడిమెట్ల సబ్‌స్టేషన్ ఎదుట వారు బైఠాయించారు. ప్రభుత్వం వెంటనే రాంబాబు కుటుంబానికి రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని, అలాగే రాంబాబు భార్యకు ఉద్యోగం ఇవ్వాలని పట్టుబట్టారు. అయినా విద్యుత్ శాఖ అధికారులు స్పందించకపోవడంతో బంధువులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వెంటనే జీడిమెట్ల పోలీసులు జోక్యం చేసుకుని మృతుడి బంధువులకు నచ్చజెప్పడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ డబీల్‌పూర్‌కు చెందిన లబ్ధిదారు మంగమ్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును గ్రామ కాంగ్రెస్ నాయకులు కుటుంబ సభ్యులకు అందజేశారు. మంగమ్మ అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలు కావడంతో రూ.21 వేల ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరావు, నాయకులు విఘ్నేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, అక్రం ,శ్రీనివాస్‌గౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న జిల్లా టీబీ అధికారి శ్రీదేవి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ విజయచంద్ర ఆధ్వర్యంలో సోమవారం క్షయ వ్యాధిగ్రస్తులకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా టీబీ అధికారి శ్రీదేవి సమక్షంలో పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హిమజ, వైద్య సిబ్బంది ఫాతిమా, రామకృష్ణ, వెంకన్న, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2 వరకు ఉత్సవాలు

నిజాంపేట్: నిజాంపేట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు విజయదశమి నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కొలను శ్రీనివాస్‌రెడ్డి, లీడర్ డా.కొలను నరసింహారెడ్డి, కొలను గోపాలరెడ్డి, శెనిగల సాయిలు యాదవ్, మేకల వెంకటేశం, బుర్ర అశోక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6 గంటలకు చండీ పాసుపత హోమం, మధ్యాహ్నం 12 గంటలకు మహా నివేదన, అన్నదానం, సాయంత్రం 4 గంటలకు లలితా సహస్ర నామ పారాయణం, రాత్రి 8 గంటలకు సువర్ణ పుష్పార్చన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆలయ అర్చకుడు సత్యం స్వామి నంబర్ 9849049733 లో సంప్రదించాలని సూచించారు.

బతుకమ్మ వేడుకలు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు సోమవారం ఆయా ప్రాంతాల్లో మహిళలు, యువతులు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ ఆడారు. అనంతరం సమీప కొలనుల్లో నిమజ్జనం చేశారు.

–జగద్గిరిగుట్ట



గండిమైసమ్మ శ్లోకా స్కూల్‌లో వేడుకలు



వెంకటేశ్వరనగర్ సత్‌జ్ఞాన్ స్కూల్‌లో..



మల్లంపేట్ స్టెర్లింగ్ హోమ్స్‌లో ..



టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో..

కొండంత ఆశతో..

ప్రజావాణిలో 95 ఫిర్యాదులు

- పండుగ వేళ కలెక్టరేట్‌లో రద్దీ
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన ప్రజలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: దీర్ఘకాలికంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాగలవన్న కొండంత ఆశతో సోమవారం కలెక్టరేట్‌కు తరలి వచ్చిన ప్రజలు ,బస్తీలు, పురపాలికల్లోని పలు కాలనీ వాసులు , సంఘాలు ,అసోసియేషన్ల ప్రతినిధులు మహిళలు ప్రజావాణిలో 95 ఫిర్యాదులతో కూడిన వినతులను అందజేశారు. గతంలో పరిష్కారం కాని సమస్యలు కలెక్టర్ పరిష్కరించగలరన్న ధీమాతో తమ వినతులను జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తాకు సమర్పించటంతోపాటు తమ కష్టాలను చెప్పుకున్నారు. నిరుపేదలు వ్యక్తిగత సమస్యలతోపాటు సంక్షేమ పథకాలు ,ఉపాధి కల్పించాలంటూ.. ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోగా, సామాజిక సంఘాలు, పట్టణ కమిటీలు, పార్టీల ప్రతినిధులు తమ ప్రాంత సమస్యలను విన్నవించారు

–పురపాలక, రెవెన్యూ శాఖలకు చెందినవే అధికం

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 95 ఫిర్యాదులు రాగా, ఇందులో రెవెన్యూ శాఖ,పురపాలక సంఘాలకు సంబంధించిన వినతులే అధికంగా ఉన్నాయి. రెవెన్యూ విభాగానికి సంబంధించి కలెక్టరేట్' డి'సెక్షన్‌లో 'పేరుకుపోయిన సమస్యలపై 19 ఫిర్యాదులు రాగా,' సి'సెక్షన్‌కు సంబంధించి నాలుగు ఫిర్యాదులు అందాయి. కీసర, మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్లతోసహా శామీర్‌పేట, బాచుపల్లి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి ,కాప్రా, మేడిపల్లి, దుండిగల్ మండలాల తహసీల్దార్లకు సంబంధించిన సమస్యలపై 17 ఫిర్యాదులతో కూడిన వినతులు అందాయి.

–పురపాలికల్లో ..

జిల్లాలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ మున్సిపల్ సర్కిళ్ల నుంచి తొమ్మిది ఫిర్యాదు రాగా, నాగారం, దుండిగల్, తూముకుంట, నిజాంపేట, దమ్మాయిగూడ, బోడుప్పల్ పురపాలక సంఘాలకు సంబంధించి 15 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా తూముకుంట నుంచి ఆరు ఫిర్యాదులు అందాయి. అక్రమ కట్టడాలు ,అవినీతి ,అక్రమాలు ,భూకబ్జాలపై ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. జిల్లా వైద్యారోగ్యశాఖకు సంబంధించిన సమస్యలపై రెండు, విద్యాశాఖ రెండు, మైనింగ్ శాఖకు రెండు, గృహనిర్మాణ శాఖకు ఏడు, డీఆర్‌డీఏ2, లోకల్ బాడీస్‌కు సంబంధించిన సమస్యలపై 15 ఫిర్యాదులు అందాయి. మల్కాజిగిరి ,కీసర ఆర్డీఓ పరిధికి సంబంధించి 15 ఫిర్యాదులు వచ్చాయి గత ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు ,దరఖాస్తులపై సరైన సమీక్షలు లేకపోవటం, అధికారుల నిర్లక్ష్యం తదితర కారణాల నేపథ్యంలోనే మళ్లీ అవే సమస్యలపై ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించి పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు ,రేషన్ కార్డులపై ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ ,అసైన్డ్ భూముల పరిరక్షణపై వినతులు సమర్పించారు.

వెంటనే పరిష్కరించాలి: జిల్లా అదనపు కలెక్టర్లు

జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చి సమస్యలు పరిష్కారం కాగలవన్న నమ్మకంతో ప్రజలు ప్రజావాణికి వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత వివిధ శాఖల జిల్లా అధికారులపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా(లోకల్‌బాడీ), విజయేందర్‌రెడ్డి(రెవెన్యూ) అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తిరస్కరించే దరఖాస్తుల సమాచారాన్ని సంబంధిత కారణాలతో అర్జీదారులకు తెలుపాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. వినతులపై చేపట్టిన చర్యల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో భద్రంగా పొందుపరచాలన్నారు.కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రహరీలు ఉన్నా.. లేనట్టే..!



వార్డు ఆఫీస్‌కు ఆనుకుని నిర్మించిన ప్రహరీ లోపల భవన నిర్మాణ సామగ్రి



అసంపూర్తిగా వదిలేసిన రాజీవ్ గృహకల్ప 54 బ్లాక్ ఆనుకొని ప్రహరీ

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు జీహెచ్‌ఎంసీ అధికారులు లక్షలు వెచ్చించి వాటి చుట్టూ ప్రహరీలు నిర్మించారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో వార్డు ఆఫీస్‌కు ఇటీవలే కంపౌండ్ నిర్మాణం చేపట్టి గేట్ కూడా ఏర్పాటు చేశారు. అయితే ఎప్పటి నుంచో భవన నిర్మాణ సామగ్రి దందా చేస్తున్న ఓ స్థానికుడు ఇదే కంపౌండ్ వాల్ లోపల తన సామగ్రిని అలానే ఉంచి దందాను సాగిస్తున్నాడు. అలాగే రాజీవ్ గృహకల్ప 54 బ్లాక్ ఆనుకుని ప్రహరీ నిర్మించారు. కానీ చివరిలో 20 ఫీట్ల వరకు వదిలివేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా ఉన్న కొంతమంది వ్యక్తులు ఇక్కడ నిర్మాణం జరగకుండా ఆపారని తెలిసింది. ఇకనైనా అధికారులు స్పందించి పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.